తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది
- మిషన్ భగీరథ నీరందని గ్రామాలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి
- అదనపు కలెక్టర్ రమేశ్

నర్సాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

నర్సాపూర్/ కౌడిపల్లి, మార్చి 27: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ కమిషనర్, కౌడిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, అధికారులుతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యపై జిల్లాల వారీగా చేపడుతున్న చర్యలపై సీఎస్ శాంతకుమారి ఆదేశాల మేరకు కలెక్టర్ సలహాలు సూచనలు పాటిస్తూ క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్య నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్యను నివారించేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వేసవి కాలం ప్రారంభమైనందున నీటి ఎద్దడి తలెత్తె అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని అన్నారు. గతేడాది నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో రిపీట్ కాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా చివరిలో ఉన్న ఆయా గ్రామాల్లో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఏఈలు అన్ని గ్రామాలు తిరిగి తాగునీటి సరఫరాలో కలిగే సమస్యలు గుర్తించి సరి చేయాలని సూచించారు. తాగు నీటిని వృథా చేయకుండా ఎలా ఉపయోగించాలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ ఆఫీసర్స్ సమక్షంలో నీటి వృథా చేయకుండా వాడుకోవడంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. నర్సాపూర్ సమావేశంలో ఎంపీడీవో మధులత, ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషన్, మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్, కౌడిపల్లి సమావేశంలో ఎంపీడీవోలు, ఎంపీవో, పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థానికి మాజీ ఎమ్మెల్యే హాజరు

నిశ్చితార్థంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27: జిల్లా కేంద్రంలోని ద్వారక గార్డెన్‌లో మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్ కుమార్తె నిఖిత వివాహ నిశ్చితార్థం బుధవారం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఏఎమ్‌సీ మాజీ చైర్మన్ జగపతి హాజరయ్యారు.

అటవీ సంరక్షణకు అందరూ పాటుపడాలి

తొనిగండ్ల అటవీలో ప్రాంతంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో

రామాయంపేట, మార్చి 27: అటవీశాఖను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అటవీశాఖ ఎఫ్ఆర్‌వో విద్యాసాగర్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో కుత్బుద్దీన్, బీట్ ఆఫీసర్ రాము తెలిపారు. బుధవారం మండలంలోని తొనిగండ్ల, కాట్రియాల, పర్వతాపూర్‌లో వనదర్శిని కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అటవీ శాఖలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. అడవిలోని కలప, జంతువుల నీటి సాసర్ ఫిట్లు, జంతువుల కదలికలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, వివేకానంద, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పని చేసుకోవాలని మందలించడంతో ఆత్మహత్య

నర్సింహులు (ఫైల్)

చిలిపిచెడ్, మార్చి 27: పని చేసుకోమని చిన్నమ్మ మందలించడంతో కొడుకు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చండూర్ గ్రామంలో బుధవారం జరిగింది. ఏఎస్సై మిస్బోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూర్ గ్రామానికి చెందిన గుట్టుమీది నర్సింహులు (20) ఏ పని చేయకుండా మద్యానికి, చెడు అలవాట్లకు బానిసై ఖాళీగా తిరుగుతున్నాడని చిన్నమ్మ అనిత మందలించింది. దీంతో మనస్తాపంచెందిన నర్సింహులు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రులు చిన్నతనంలోనే అకాల మరణం చెందారు. మృతుడి అక్క మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం ఏఎస్సై మిస్బోద్దిన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చల్మెడ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

నిజాంపేట, మార్చి 27: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చల్మెడ గేట్ వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగోకుల్ గ్రామానికి చెందిన మ్యాదరి కరుణాకర్, చౌడ స్వామి ద్విచక్ర వాహనంపై రామాయంపేట వైపు వెళ్తున్నారు. సిద్ధిపేటలో జరిగే వివాహ వేడుకకు చేగుంట నుంచి వస్తున్న పెళ్లి బృందం కారు చల్మెడ గేట్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరుణాకర్, స్వామికి తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, ఆ తర్వాత హైదరాబాద్ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నిజాంపేట పోలీసులు విచారణ చేపట్టారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

దగ్ధమైన ద్విచక్రవాహనం

చిలిపిచెడ్, మార్చి 27: అర్ధరాత్రి ద్విచక్రవాహనం దగ్ధమైన ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిలిపిచెడ్ గ్రామానికి చెందిన గాండ్ల రాములు ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. గ్రామానికి చెందిన వారు కక్షపూరితంగా తన వాహనాన్ని దగ్ధం చేశారని బాధితుడు రాములు ఆవేదన వ్యక్తంచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై మిస్బోద్దీన్ కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సెల్‌ఫోన్‌ను అందిస్తున్న ఎస్సై నారాయణ

చిన్నశంకరంపేట, మార్చి 27: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను చిన్నశంకరంపేట పోలీసులు బాధితుడికి బుధవారం అందజేశారు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన తలారి రమేశ్ గత నెలలో తన సెల్‌ఫోన్ పొగొట్టుకున్నాడు. బాధితుడు చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌ను పట్టుకుని బాధితుడికి ఎస్సై నారాయణ అందజేశారు.

అనారోగ్యంతో యువకుడు మృతి

శశికుమార్ (ఫైల్)

చిన్నశంకరంపేట, మార్చి 27: కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ యువకుడు మృతి చెందిన ఘటన అంబాజిపేటలో బుధవారం జరిగింది. మండలంలోని అంబాజిపేటకు చెందిన వ్యాప శశికుమార్(27) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 18న మానసిక ఆవేదనకు గురై పురుగుల మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, మార్చి 27: నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడుపాయల ఆలయ సమీపంలో ఉన్న మంజీరా చెక్ డ్యాంలో బుధవారం జరిగింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన గుడ్ల సిద్ధిరాములు (28) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఏడుపాయల దుర్గమ్మ దర్శనం కోసం మంగళవారం తోటి వారితో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆలయ సమీపంలోని చెక్ డ్యామ్ వద్దకు వెళ్లి నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న తోటి వారు గమనించి చెక్ డ్యామ్‌లో వెతికారు. రాత్రి సమయంలో మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టు మార్టం నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కౌన్సిలర్ ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా

మెదక్ అర్బన్, మార్చి 27: మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులు బుధవారం ధర్నా చేశారు. బీఆర్ఎస్ పార్టీ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మామిళ్ల ఆంజనేయులు ఎమ్మెల్యే రోహిత్‌రావు, హన్మంతరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ధర్నా చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మెదక్ పట్టణ, రూరల్ పోలీసులు ధర్నాను విరమింపచేసి కాంగ్రెస్ నాయకులను పంపించారు.

జిల్లాలో ముగిసిన కుష్టు వ్యాధి సర్వే

- అనుమానితులు 871 మంది
- జిల్లా వ్యాప్తంగా 554 టీంలు
- జిల్లాలో 20 పీహెచ్‌సీలు.. 554 మంది సిబ్బంది

కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే చేస్తున్న ఆశలు

మెదక్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కుష్టు వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాయి. వ్యాధిని ఆదిలోనే అంతం చేయడానికి ఏటా కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే చేయిస్తున్నాయి. మెదక్ జిల్లాలో ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) పేరిట వైద్య ఆరోగ్యశాఖ ఈ నెల 13 నుంచి 27 వరకు ఇంటింటి సర్వే చేపట్టింది.

కుష్టు వ్యాధి అనుమానితులు 871 మంది

ఎల్‌సీడీసీ సర్వేతో జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ 6,91,240 మందికి స్క్రీనింగ్ చేశారు. జిల్లాలో లక్షా 80 వేల నివాస గృహాలు ఉండగా 1,76,408 ఇండ్లను సందర్శించారు. 7,78,228 మంది జనాభా ఉంది. ప్రతి వ్యక్తిని పూర్తిస్థాయిలో పరీక్షించారు. అందులో 871 మందికి కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించారు. వ్యాధి నిర్ధారణ కోసం డాక్టర్ల వద్దకు సిఫారసు చేశారు. ఒకవేళ వ్యాధి ఉన్నట్లు తేలితే వెంటనే చికిత్స ప్రారంభించేందుకు ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది.

554 బృందాలతో ఇంటింటి సర్వే

జిల్లాలో 554 బృందాలతో ఆశకార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టారు. శరీరంపై తెల్లమచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలుంటే ఆశలు సర్వేతో వివరాలు నమోదు చేసుకున్నారు. అనుమానిత లక్షణాలున్న వారిని మరోసారి లెప్రసీ బృందంతో పరీక్షలు చేయిస్తారు.

ముగిసిన కుష్టు నిర్ధారణ సర్వే

జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే బుధవారంతో ముగిసింది. సర్వేలో 871 మందికి లక్షణాలున్నట్లు గుర్తించాం. జిల్లా వ్యాప్తంగా 554 టీంలు సర్వేలో పాల్గొన్నాయి. వ్యాధి ఉన్నట్లు తేలితే వెంటనే ఎండీటీ ట్రీట్‌మెంట్ అందిస్తాం. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.
– డాక్టర్ శ్రీరాం, డీఎంహెచ్‌వో మెదక్

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన


హనుమాన్ విగ్రహ ప్రతిష్టకు పూజలు చేస్తున్న వేద పండితుడు రవిశాస్త్రి

రామాయంపేట, మార్చి 27: రామాయంపేట పురపాలిక పరిధిలోని కోమటిపల్లి గిరిజన తండాలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారి సన్నిధిలో ప్రముఖ వేద పండితుడు రవిశాస్త్రి ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠకు పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, కౌన్సిలర్ నాగరాజు, వర్ధన్, బన్సీలాల్, సక్రు, కమల్యా నాయక్, పెంట్యా నాయక్, సౌమ్యానాయక్, శివాజీ, శ్రీనివాస్, మంగ్యానాయక్, రవి, సంతోష్ సింగ్, నరేందర్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

శ్రీధర్‌రెడ్డి, ప్రెసిడెంట్

నర్సాపూర్, మార్చి 27: నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేసి న్యాయవాదులంతా నూతన బార్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఇక్బాల్ అలీ జాఫర్, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రభు, కోశాధికారి, గ్రంథాలయ కార్యదర్శి సుధాకర్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి బాలకిషన్, గౌర వ కార్యదర్శులుగా అంజిరెడ్డి, మహమ్మద్ ఖాజా మొయినోద్దిన్, శంకర్‌రెడ్డి, ఏ.శ్రీనివాస్, ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

కేంద్ర బలగాలతో సీఐ కృష్ణ

వెల్దుర్తి, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వెల్దుర్తిలో తూప్రాన్ సీఐ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి బుధవారం కవాతు నిర్వహించారు. వెల్దుర్తిలోని పోలీస్ స్టేషన్ నుంచి హనుమాన్, బస్టాండ్ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు, పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కవాతులో ఎస్సై నవత, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిని కలిసిన మంజూర్

వెంట్రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంజూర్

రాయపోల్, మార్చి 27: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ కలెక్టర్ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌తో బుధవారం మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు కార్యకర్తలు ఉన్నారు

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

రామాయంపేట, మార్చి 27: కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని, మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు చేపట్టాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కర్రె రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం రామాయంపేటలోని విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నర్సగల్ల రవి, తుడుం శ్రీనివాస్, రాజు ఉన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

రామాయంపేట, మార్చి 27: రామాయంపేటలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం, పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, టీచర్ సంగీత ఆధ్వర్యంలో చిన్నారులకు పౌష్టికాహారం అందజేసి, అక్షరాభ్యాసం చేపట్టారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో షాజిల్ ఉద్దీన్

రామాయంపేట, మార్చి 27: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనుల్లో అవకాశం ఉంటుందని ఎంపీడీవో షాజిల్ ఉద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని దామరచెర్వు, తొనిగండ్ల తదితర గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించారు. దామరచెర్వు గ్రామంలోని చెరువు గట్టులో ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధి కూలీలతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు మల్లేశం, పంబాల జ్యోతి, సంధ్య, ఏపీవో శంకర్ తదితరులున్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

జాన్‌డీర్ ట్రాక్టర్స్ ఇండియా హెడ్ శైలేందర్ జక్తార్

జాన్‌డీర్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న శైలేందర్ జక్తార్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా జాన్‌డీర్ ముందుకెళ్తుందని, ట్రాక్టర్ల అమ్మకాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని జాన్‌డీర్ ఇండియా హెడ్ శైలేందర్ జక్తార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లికోటాల్‌లో అత్యాధునిక హంగులతో నిర్మించిన జాన్‌డీర్ ట్రాక్టర్ షోరూమ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తామన్నారు. 24 ఏండ్లలో ట్రాక్టర్ల అమ్మకాల్లో ఇతర కంపెనీలతో పోటీ పడి దేశంలోనే 47 శాతంతో నంబర్ వన్‌గా జాన్‌డీర్ ఉండడం అనందంగా ఉందన్నారు. మెదక్‌లో ఏర్పాటు చేసిన షోరూమ్ ఆసియా ఖండంలోనే అతి పెద్దదన్నారు. సేల్స్‌లోనూ ముందు వరుసలో ఉందన్నారు. మెదక్ షోరూమ్ ద్వారా ఇప్పటికే 13 వేల ట్రాక్టర్లు విక్రయించినట్లు తెలిపారు. ఈ షోరూమ్‌లో 300 మంది ఉపాధి పొందుతున్నరన్నారు. కార్యక్రమంలో ఇండియా మార్కెటింగ్ మేనేజర్ నవీన్ సెంగర్, డీలర్ డెవలప్‌మెంట్ మేనేజర్ కైలాష్ హనుపమన్‌రాజ్, డీలర్ రాజేశ్ యాదవ్, జనరల్ మేనేజర్ రాజేశ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్ట్ పగడయ్యకు అవార్డు

పగడయ్యకు బెస్టు ఆవార్డును అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి రాములు

చేగుంట, మార్చి 27: చేగుంట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్ట్ పగడయ్యకు ఉత్తమ అవార్డును జిల్లా వైద్యాధికారి రాములు బుధవారం అందజేశారు. జిల్లా కేంద్రంలో ఈ అవార్డును అందజేశారు. ప్రజలకు మంచి సేవలు అందించి, ప్రజల మన్ననలు పొంది, ఈ నెలలో పదవీ విరమణ పొందుతున్న పగడయ్యను డీఎంహెచ్‌ఓ సన్మానించారు. కార్యక్రమంలో చేగుంట పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పంటలు రక్షించుకునేందుకు తంటాలు

- ట్యాంకర్లతో నీళ్లు పోసి పంటలకు జీవం పోస్తున్న రైతులు


వరి పంటను ట్యాంకర్ నీటితో తడుపుతున్న రైతు

ట్యాంకర్ నీటితో పొలానికి నీరు పారిస్తున్న రైతు మల్లయ్య


పెద్ద తండాలో ఎండిపోయిన వరి పంట

చేగుంట, మార్చి 27: వరి పంట పొట్ట దశకు వచ్చింది. నాలుగైదు తడులైతే ఎంతో కొంత పంట చేతికి వస్తుంది. దీంతో పంటలు రక్షించుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. నార్సింగి మండల కేంద్రంలోని నర్సంపల్లికి వెళ్లే దారిలో ఏ రైతు పరిస్థితి చూసిన వర్ణనాతీరం. నార్సింగికి చెందిన సంద మల్లయ్య, బోళ్ల నర్సింహులు ఇలా అనేక మంది రైతులు పొట్టదశకు వచ్చిన వరి పంటను రక్షించుకునేందుకు ట్యాంకర్లతో నీటిని పోస్తున్నారు. దీనికి రూ. 800 నుంచి వెయ్యి వరకు పెట్టి ఎకరం న్నర పొలానికి ట్యాకర్‌తో నీటిని పారిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 40 ట్యాకర్లతో పంటకు నీరు పెడుతున్నట్లు మల్లయ్య తెలిపారు. సమీపంలోని బోళ్ల నర్సింహులు తనకున్న రెండున్నర ఎకరాలకు 60 ట్యాంకర్లు తెప్పించి నీటిని పోసి పంటను కాపాడుకుంటున్నారు. పెట్టుబడి రాకున్నా తినేందుకు వచ్చినా చాలని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు రుణమాఫీ చేస్తుందో, పంటకు పెట్టుబడి సాయం ఎప్పుడొస్తుందోనని రైతులు వాపోతున్నారు.